పొగాకు వినియోగంతో వ్యాధులు వస్తాయి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 26: పొగాకు వినియోగంతో క్యాన్సర్, గుండె జబ్బులు వస్తాయని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో డీఎంహెచ్‌వో మధుసూదన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పి సిబ్బంది, ఎంసీడీ సూపర్ వైజర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. మానసికంగా కృంగుబాటయ్యే వ్యక్తులు 14416 నంబర్‌కు కాల్ చేస్తే మానసిక నిపుణులు ఉచితంగా అవగాహన కల్పిస్తారన్నారు. చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. ఉప వైద్యాధికారి కొమురయ్య, డాక్టర్ రవిరాథోడ్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి గోల్డ్ మెడల్

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 26 : ఒడిశాలో జరుగుతున్న కోల్ ఇండియా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భూపాలపల్లికి చెందిన క్రీడాకారుడు శ్రీనివాస్‌రెడ్డి 93 కేజీల పవర్ లిఫ్టింగ్ కేటగిరిలో 595 కిలోలు బరువు ఎత్తి గోల్డ్ మెడల్ సాధించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ కే మారుతి తెలిపారు. సింగరేణి జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ సామిల్ సుధాకర్, భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్, సింగరేణి టీం మేనేజర్ పీ శ్రావణ్‌కుమార్, టీం కోచ్ రమేశ్, టీం అబ్జర్వర్ పర్స శ్రీనివాస్ శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి : ఎస్పీ

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 26 : నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, దర్యాప్తు జరిగిన విధానం, చార్జిషీట్ దాఖలు, కోర్టులో కేసులు ఏ దశలో ఉన్నాయన్న అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో డ్రగ్స్, సైబర్ నేరాలు, గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలన్నారు. ఓఎస్‌డీ బోనాల కిషన్, డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణనాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 26 : దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేస్-3 లోని రెండు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతోంది. రోజుకు 583 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

బరువు తక్కువ పిల్లలకు ప్రత్యేక చెకప్

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 26 : మండలంలోని పీఎస్‌సీలో సీడీపీవో ప్రేమలత, వైద్యుడు గిరి ఆధ్వర్యంలో పోషణలోపంతో ఉన్న ప్రీస్కూల్ పిల్లలకు గురువారం ప్రత్యేక హెల్త్ చెకప్ చేశారు. పోషణలోపం ఉన్న పిల్లలను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పవతి, శ్రీవిద్య, హెల్త్ సూపర్‌వైజర్ రమణాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు సుగుణ, రజిత, అనిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

గోవిందరావుపేట, సెప్టెంబర్ 26 : మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఊట్ల మోహన్‌ను గురువారం సాయంత్రం మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహానాయక్ పరామర్శించారు. మోహన్ గత వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదానికి గురి కాగా అతన్ని పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చల్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు నాంపూర్ణచందర్, నాయకులు చుక్క గట్టయ్య, వెంకన్న, ఓదేలు, కృష్ణారెడ్డితోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై నూతన పోరాటాలు

కాటారం, సెప్టెంబర్ 26 : ప్రజల పక్షాన నిలబడుతూ ప్రజా సమస్యలపై ఇక నుంచి నూతన పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రథమ మహాసభలు నిర్వహించారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ముందుగా సంతాపం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏచూరి మరణం సీపీఎం పార్టీకి, భారత సమాజానికి తీరని లోటన్నారు. బొడ్డు స్మరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజేందర్, మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, మహేందర్, మల్లేశ్వరి, కిశోర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సురక్షిత నీరు అందించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, సెప్టెంబర్ 26 : గ్రామాల్లో సురక్షిత మంచి నీరు అందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం కేటీపీపీ సమావేశ హాలులో మిషన్ భగీరథ, ఇంట్రా, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ తరగతులు నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గణపురం, భూపాలపల్లి మండలాల్లో ఎంపిక చేసిన గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పంచాయతీల్లో 365 రోజులు సిబ్బంది విశిష్ట సేవలు అందిస్తున్నారని తెలిపారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఆర్థికపరమైన సమస్యలు వస్తే తన దృష్టికి తేవాలని ఆయన సూచించారు. ప్రతి నెలా 1, 11, 21 తేదీల్లో మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి వివరాలు రిస్టర్లలో నమోదు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చేయాలన్నారు. బతుకమ్మలు నిమజ్జనం చేసేందుకు వీలుగా ప్రత్యేక ఘాట్లను, విద్యుత్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మంచినీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయరాణరావు, మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశ్, ఇంట్రా ఈఈ నిర్మల, భగీరథ ఈఈ మణిక్యాలరావు, ఎంపీడీవోలు భాస్కర్, ఇక్బాల్ హుస్సేన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

కృష్ణకాలనీ : మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే జీఎస్ఆర్ అన్నారు. రూ.30 లక్షలతో కారల్ మార్క్స్ కాలనీలో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు, రూ. 50 లక్షలతో పోలీస్ స్టేషన్ రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులు, రూ.60 లక్షలతో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం నుంచి తహసీల్ కార్యాలయ రోడ్డులో బీటీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పనులను కాంట్రాక్టర్లు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు.

రూ.1,551 కోట్లు లాభాల బోనస్‌గా అందించాలి

టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు సమ్మయ్య

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 26: సింగరేణి కార్మికులకు రూ.1,551 కోట్లు లాభాల బోనస్‌గా అందించాలని టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య డిమాండ్ చేశారు. సింగరేణికి ఇచ్చిన వాస్తవ లాభాల్లో 33 శాతం కార్మికులకు ఇవ్వాలని కోరుతూ గురువారం కేటీకే ఓసీ-2, 5 ఇంక్లైన్ గనులపై టీబీజీకేఎస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ గత సంవత్సరం సింగరేణికి వచ్చిన రూ.4,701 కోట్లలో కార్మికులకు రూ.1,551 కోట్లు లాభాల బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ పూర్తయిన తర్వాత ఎమ్మెల్యే జీఎస్ఆర్‌కు పంపించి న్యాయం చేయాలని కోరనున్నట్లు చెప్పారు. టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ సదానందం, నరేశ్‌నేత, రవీందర్, సిరిపెల్లి రవీందర్, మల్లారెడ్డి, రవీందర్, అవినాశ్, సురేశ్ పాల్గొన్నారు.

మహిళా కార్మికుల నుంచి సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ములుగు డీఈవో ఆఫీస్‌లో ల్యాప్‌ట్యాప్‌ల చోరీ

ములుగురూరల్, సెప్టెంబర్ 26 : ములుగు డీఈవో కార్యాలయంలో ల్యాప్‌ట్యాప్‌లు చోరీ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యాశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. గురువారం డీఈవో పాణిని, ఎస్సై వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు. విద్యాశాఖలో పనిచేస్తున్న కోఆర్డినేటర్లకు పంపిణీ చేసేందుకు ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఐదు ల్యాప్‌ట్యాప్‌లను సరఫరా చేసింది. వాటిని అధికారులు పెట్టెలో పెట్టి తాళం వేసి డీఈవో కార్యాలయంలో భద్రపరిచారు. ఈ నెల 10న తాళం తీసి చూడగా మూడు ల్యాప్‌టాప్‌లు మాత్రమే ఉన్నాయి. మిగతా రెండు మాయమైనట్లు గుర్తించి కార్యాలయ సిబ్బంది, అధికారులను అవగగా తమకేమీ తెలియదని అంటున్నారని తెలిపారు. ఈ విషయమై జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ ఇనుగాల సత్యనారాయణ గురువారం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

గోవిందరావుపేట, సెప్టెంబర్ 26 : పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ఉండవచ్చని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య అన్నారు. మండలంలోని పస్రా గ్రామంలో వైద్యాధికారి సుగుణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. అభ్యుదయ కాలనీలోని పలు వీధులను సందర్శించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న మోదీ

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 26 : మోదీ ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల్లో చీలిక తీసుకువస్తున్నదని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజు అన్నారు. గురువారం తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా సందస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. దేశ రాజకీయాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చంద్రగిరి శంకర్, ప్రజా సంఘాల నాయకులు శీలపాక నరేశ్, రవి, రాకేశ్, ప్రకాశ్, రాము, లక్ష్మణ్, రాజేశ్ పాల్గొన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన డీఎస్‌డీవో

ఏటూరునాగారం, సెప్టెంబర్ 26 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలిక, బాలుర హాస్టళ్లను డీఎస్‌డీవో లక్ష్మణ్‌నాయక్ గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టళ్లలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళ విద్యార్థులు బయటకు వెళ్లొద్దని సూచించారు. వర్కర్ల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. పరిసరాల శుభ్రత, భోజనశాల, టాయిలెట్స్‌ను పరిశీలించారు. తాగునీటి సమస్యలు ఉన్నాయా..? లేదా తెలుసుకున్నారు. హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్లు ప్రశాంత్, రేణుకతో మాట్లాడారు.

ఏజెన్సీ గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ములుగురూరల్, సెప్టెంబర్ 26 : ఏజెన్సీ గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జగ్గన్నగూడెంలో గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకొని ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. వ్యవసాయం చేసుకుంటున్న వారికి పట్టాలు, రైతులకు రుణమాఫీ, రైతు బీమా, పంట రుణాలు అందించడంతోపాటు తునికాకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బొగ్గులవాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు రత్నం రాజేందర్, గఫూర్‌పాషా, శోభన్, రవిగౌడ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్రకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మహిళలు

గిరిజనులకు తీజ్ ముఖ్యమైంది

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 26 : గిరిజనులు జరుపుకునే పండుగల్లో తీజ్ ముఖ్యమైనదని, బతుకమ్మ పండుగ తరహాలో సాగే తీజ్ ఉత్సవాలు వారి సంప్రదాయాలకు అద్దంపడుతాయని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం కుందూరుపల్లి జరుగుతున్న తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు, కౌన్సిలర్, సీనియర్ నాయకులు దేవేందర్‌రెడ్డి, బెడ్డల పోషయ్య పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కేటీపీపీ ఆర్టిజన్ కార్మికులు

గణపురం, సెప్టెంబర్ 26 : కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నాకు చెల్పూరు కేటీపీపీ కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చలు జరిపి తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు.

ఎన్ఎంఎంఎస్ఎస్ స్కీమ్ పరీక్ష ఫీజు గడువు పెంపు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 26: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్ఎస్) పరీక్ష ఫీజు గడువు ఈ నెల 30 వరకు పొడగించినట్లు డీఈవో రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు http://bse.telangana.gov.in అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

కార్పొరేట్ స్థాయి దవాఖాన ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 26: కార్మికులకు మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ స్థాయి దవాఖానను సింగరేణి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జీఎం కార్యాలయం ఎదుట బీఎంఎస్ కార్మికులు ధర్నా చేసి జీఎంకు వినతిపత్రం అందజేశారు. బ్రాంచ్ కార్యదర్శి రేణికుంట్ల మల్లేశ్, రాసకట్ల నరసింహారావు, కోశాధికారి రఘుపతిరెడ్డి, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బర్ల నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి పెంపు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 26 : అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి ఈ నెలాఖరులోగా ముగుస్తున్నందున అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు పొడిగించినట్లు డీపీఆర్వో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యూవల్ స్లిప్పులు 28వ తేదీ నుంచి జర్నలిస్టులకు డీపీఆర్వో కార్యాలయం నుంచి జారీ చేస్తామని తెలిపారు.

దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు

మహాముత్తారం, సెప్టెంబర్ 26: అర్హులైన దివ్యాంగులందరికీ సహాయ ఉపకరణాలు ఇవ్వనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో దివ్యాంగుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించగా 99 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, సీడీపీవో రాధిక, ఈపీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

నవంబర్‌లో రిజిస్ట్రేషన్ బాదుడు!

- భారీగా పెరగనున్న చార్జీలు
- తుదిదశకు చేరిన థర్డ్ పార్టీ ఏజెన్సీ అధ్యయనం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవంబర్ నుంచి సవరించిన చార్జీలను రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ధరలను ఆగస్టు 1 నుంచే అమలు చేయాలని భావించింది. ఈ మేరకు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జూన్‌లో షెడ్యూల్‌ను విడుదల చేసింది. అధికారులు జిల్లాల్లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి జూలైలో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ధరల సవరణ అధ్యయన బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నంబర్ల వారీగా భూముల విలువను అధ్యయనం చేసి, ఎక్కడ పెంచేందుకు అవకాశం ఉన్నదో, ఎక్కడ తగ్గించాల్సి వస్తుందో, ఎంత మేర సవరించాలో సూచించాలని పేర్కొన్నది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థ అధ్యయనం తుది దశకు చేరిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం పనులు ప్రారంభం కావడం, ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల సవరణపైనా అధ్యయనం చేసినట్టు చెప్తున్నారు. వారంరోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనున్నట్టు సమాచారం. ప్రభుత్వం సమీక్ష అనంతరం ఏ స్థాయిలో ధరలను సవరించాలో నిర్ణయిస్తారని చెప్తున్నారు. నవంబర్ మొదటివారంలో పెంపును అమలు చేసే అవకాశం ఉంది. 'ఇది రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు కాదు. శాస్త్రీయంగా ధరల స్థిరీకరణ. స్థానిక పరిస్థితులను బట్టి చార్జీలు పెంచాలో, తగ్గించాలో నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది' అని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

బది'లీలల'పై కొరడా?

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారని సమాచారం. ఈ బదిలీల్లో అధికార పక్ష నేతలు, ఉన్నతాధికారుల సన్నిహితులకు కోరుకున్న స్థానాలను కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్ల మేర చేతులు మారినట్టు చర్చ జరిగింది. కొందరు అధికారులే దళారుల అవతారం ఎత్తి పోస్టింగ్‌ల బదిలీలల్లో కీలక పాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి, సీఎం గుర్రుగా ఉన్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

సహకార డెయిరీలకు సమాధి!

- హైదరాబాద్ పాలమార్కెట్‌పై ఆధిపత్యానికి హెరిటేజ్ యత్నం
- సర్కారు ప్రోత్సాహంతో ప్రాంతేతరుల పెట్టుబడులు
- శ్వేత విప్లవానికి బాటలు వేసిన కేసీఆర్ ప్రభుత్వం
- స్వరాష్ట్ర రైతుల పుట్టిముంచుతున్న రేవంత్ సర్కారు
- ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వ్యత్యాసం
- అదే ధరకు సేకరిస్తే రాష్ట్ర పాడి రైతుకు తీవ్రనష్టం

ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రోడ్డుపై పాలను పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

కరీంనగర్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాడి రైతు మెడపై ప్రాంతేతరుల కత్తి వేలాడుతున్నది. స్వరాష్ట్రంలో శ్వేత విప్లవానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేస్తే.. కాంగ్రెస్ సర్కారు కుట్రల కారణంగా విజయ డెయిరీతోపాటు మిగిలిన కో ఆపరేటివ్ డెయిరీల మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం కనిపిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో రూ.200 కోట్లకుపైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతోపాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పాలవిక్రయాల అతి పెద్ద మార్కెట్ హైదరాబాద్. ఇక్కడ రోజుకు 20 లక్షల నుంచి 22 లక్షల లీటర్లకుపైగా డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంలో విజయ డెయిరీ లాంటివి కాస్త వెనుకబడగా..ఇపుడు ఆ మార్కెట్‌ను ప్రాంతేతర డెయిరీలు ఆక్రమిస్తున్నాయి. హెరిటేజ్, జెర్సీ, అమూల్, నందిని వంటి డెయిరీలు.. స్థానిక డెయిరీలకు మించి మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్క హెరిటేజ్ వాళ్లే రోజుకు హైదరాబాద్‌లో 5 లక్షల లీటర్లకు పైగా పాల విక్రయాలు చేస్తున్నట్టు సదరు రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టి హైదరాబాద్ మార్కెట్ మొత్తం శాసిస్తే రాష్ట్రంలోని విజయ డెయిరీతోపాటు కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు వంటి వాటి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకునే ప్రమాదమున్నది.

రైతుల ఆదాయంపై దెబ్బ?

నిజానికి పాడి పరిశ్రమను ఆహ్వానించడం ఎవరూ తప్పుపట్టరు. కానీ సదరు పరిశ్రమతో రాష్ట్రంలోని పాడిరైతులకు వచ్చే ప్రమాదాలను పట్టించుకోకుండా రేవంత్ సర్కారు ముందు కెళ్తున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే హెరిటేజ్‌లాంటి సంస్థల దాటికి విజయ డెయిరీ కుదేలవుతుండగా.. ఇపుడు ఇతర కో-ఆపరేటివ్ డెయిరీలకూ ముప్పు పొంచిఉన్నది. దీనికి కారణం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రాలో రైతులకు ఇచ్చే ఒక లీటర పాల ధరలో రూ.4 నుంచి రూ.7 వరకు వ్యత్యాసం ఉండడమే. ప్రస్తుతం 3 శాతం ఫ్యాట్ ఉన్న పాలను కరీంనగర్ డెయిరీ లీటర్‌కు రూ. 35.65కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీలోని చిత్తూరులో రూ.31.50కు కొనుగోలు చేస్తున్నారు. 3.5 శాతం ఫ్యాట్ ఉన్న లీటర్‌పాలను చిత్తూరులో రూ.33కు కొనుగోలు చేస్తుండగా, కరీంనగర్ డెయిరీ రూ.40.25కు కొనుగోలు చేస్తున్నది. అంటే ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వరకు తేడా ఉన్నది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని డెయిరీల మార్కెట్‌ను దెబ్బతీసేందుకు సరికొత్త స్కీమ్ పెట్టి లేదా.. ధర తగ్గించి సదరు కంపెనీలు పాలు అమ్మే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పలు పాల కంపెనీలు ఈ తరహా మార్కెటింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాంతేతర డెయిరీల పోటీని తట్టుకోవాలంటే రాష్ట్రంలోని కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు డెయిరీలు కూడా రైతుకు ఇచ్చే పాలసేకరణ ధరను తగ్గించాల్సి ఉంటుంది. పాల ధర తగ్గించకపోతే మార్కెట్ విక్రయాల్లో ఈ డెయిరీలు వెనుకబడిపోయే ప్రమాదమున్నది. తద్వారా డెయిరీలే మూతపడే ప్రమాదమున్నది. అదే జరిగితే కరీంనగర్, మూల్కనూరు డెయిరీ పరిధిలోనే దాదాపు 3 లక్షలకు పైగా పాడి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నది. ప్రాంతేతర డెయిరీల మార్కెట్‌కు దీటుగా పాలసేకరణ ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కావన్నది నిపుణుల అభిప్రాయం. ఆంధ్రాలోని పాడిరైతులకు వచ్చే ఖర్చుతో పోల్చితే.. తెలంగాణలో వాతావారణం, ఇతర మార్పుల నేపథ్యంలో 25 శాతానికిపైగా అదనపు ఖర్చు వస్తుందని పాడిపరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి రైతాంగానికి సరిపడా రేటు గిట్టుబాటు అయ్యేందుకు కావాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టిపెటాలన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

యువతిపై ప్రేమోన్మాది దాడి

సాయికుమార్ (ఫైల్)

రామంతాపూర్, సెప్టెంబర్ 26: ఓ యువతిపై ప్రేమోన్మాది దాడి చేసిన ఘటన ఉప్పల్ బస్‌స్టాప్ వద్